## క్లుప్తంగా

### నేడు రాయిపేటలో అన్నసమారాధన

నరసాపురం: పట్టణంలోని రాయిపేట శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉగాది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలు నుంచి నిర్వహించే అన్నసమారాధనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

### అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ



గుంపర్రులో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

యలమంచిలి: మండలంలోని గుంపర్రు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో అయినవల్లి ఆనందరావు ఇల్లు దగ్ధమైంది. ప్రమాద విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం గుంపర్రు వెళ్లి ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఓదార్చారు. తన వంతు సహాయంగా బాధితులకు నిత్యావసరాలు అందజేశారు. ఆయన వెంట గుంపర్రు ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ, పార్టీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, వీరా ఉమా శంకర్, గణపాబత్తుల ఏసుబాబు, ముప్పిడి కుమార్, పితాని కేశవరావు, బొంతు వెంకట కర్ణారెడ్డి, పెన్మత్స సురేష్, అయినపూడి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

### 'చిత్ర కళావీధి'లో పాలకొల్లు కళాకారులు



చిత్ర కళా వీధి ప్రదర్శనలో పాల్గొన్న పాలకొల్లు చిత్రకారులు

పాలకొల్లు సెంట్రల్: రాజమండ్రిలో నిర్వహిస్తున్న చిత్ర కళా వీధిలో పాలకొల్లు చిత్రకారుల చిత్రాలు ఆకర్షించాయి. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాజమండ్రిలో ఏర్పాటుచేసిన చిత్ర కళ వీధి కార్యక్రమంలో పాలకొల్లు చిత్రకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశం నలు మూలల నుంచి సుమారు 500 మంది చిత్రకారులు పాల్గొని తమ చిత్రాలను సందర్శనలో ఏర్పాటు చేసినట్టు పాలకొల్లుకు చెందిన చిత్రకారుడు కడలి శ్రీనివాస్ తెలిపారు. అలాగే పాలకొల్లు నుంచి గొన్నాబత్తుల సత్యనారాయణ, కొననా భాస్కరరావు, చెల్లుబోయిన రాము, నక్కా వెంకటేశ్వరరావు, బుడితి రామారావు, బి పద్మజ్యోతి, పి రమ్య, కడలి సాగర్, రాకేష్ తదితరులు చిత్ర కళా వీధి ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు.

### నరేష్‌కు ఉగాది నంది పురస్కారం



మంత్రి దుర్గేష్ చేతులుమీదుగా పురస్కారం అందుకుంటున్న నరేష్ (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో తాను అందించే సేవలకు గుర్తుగా ఉగాది నంది పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని చవ్వాకుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు చవ్వాకుల నరేష్ అన్నారు. శుక్రవారం రాజమండ్రి ఏకేసీ రోటరీ హాల్‌లో నిర్వహించిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉగాది నంది పురస్కారం అందించారన్నారు.

# పీ-4 సర్వేపై గ్రామాల్లో భయం భయం

- సంక్షేమ పథకాల్లో కోత కోసమే సర్వే అని ప్రజల అనుమానం
- 27 రకాల ప్రశ్నలతో సచివాలయ ఉద్యోగుల సర్వే
- ఇంట్లోని వస్తువుల వివరాలన్నీ నమోదు

యలమంచిలి: పీ-4 సర్వే ప్రజా సంక్షేమం కోసమా? ప్రభుత్వ పథకాల అమల్లో కోత పెట్టడం కోసమో అర్థంకాక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. ఇంటింటికీ కరపత్రాలు పంచి మీ ఇంటికి ఈ పథకాలన్నీ వస్తాయి.. ఇంత మేలు జరుగుతుందంటూ నమ్మించారు. కూటమి అధికారంలోకి వస్తే మీ జీవితాలు మెరుగుపడతాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక తొమ్మిది నెలలు దాటినా పథకాల అమలుకు నోచుకోలేదు. చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. తాజాగా పీ-4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసేందుకు లేదా కొత్త పథకాల అమల్లో కోత విధించేందుకు పాలకులు శ్రీకారం చుట్టారా? అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతుంది.

**అన్ని వివరాలూ నమోదు**

సర్వేలో భాగంగా సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. మీ ఇంటిలో టీవీ, ఏసీ, ఫోర్ వీలర్, టూవీలర్, ఇతర గృహోపకరణాలు ఏమున్నాయి? అని అడిగి నమోదు చేస్తున్నారు. ఇళ్ల స్వరూపం, రేకులు షెడ్డా, స్లాబా చూస్తున్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు అడుగుతున్నారు. ఇలా 27 రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి నమోదు చేస్తున్నారు. సర్వే అనంతరం ప్రజల ఫోన్‌కు ఓటీపీ పంపి ఆ ఓటీపీ తెలుసుకుని యాప్‌లో నమోదు చేసి ఈ సర్వేను ముగిస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల వారు సైతం అప్పో, సప్పో చేసి నెలవారి వాయిదాల్లో ఏసీలను ఏర్పాటు చేసుకొని ఉంటారు. అయితే ఆ వస్తువు ఇంట్లో ఉందని తెలిస్తే చాలు వెంటనే సదరు వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో సచివాలయ సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది.

**నిరాకరించినా నమోదు..**

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవన శైలిలో భాగమైనవే. స్మార్ట్‌ఫోన్, బైక్ ఉన్నాయా లాంటి ప్రశ్నలు ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురి చేస్తోంది.

**బాబూ నమ్మండయ్యా..**

పీ-4 సర్వేను జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కుటుంబాలను సర్వే చేస్తున్నారు.



పీ-4 సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివిధ రకాల సమాచారాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఈ సర్వే దోహదపడతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని, ఇందులో ఎలాంటి అపోహలొద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజల్లో అయోమయం నెలకొంది.

### పథకాలు ఇవ్వకలేకనే..



ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయలేకనే కూటమి ప్రభుత్వం పీ-4 సర్వే అంటూ ప్రజలను మోసం చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటువంటి సర్వేలు చేయలేదు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి.

– మంద హరికుమార్, కాంబొట్లపాలెం

### లబ్ధిదారుల సంఖ్య తగ్గించే కుట్ర



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకు అనేక ప్రయత్నాలు, సర్వేలు చేస్తుండటం దారుణం.

– వీరా ఉమా శంకర్, గుంపర్రు

### రాములోరి అలంకరణలో వెంకన్న



శ్రీరాముడి అలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వరస్వామిని శనివారం శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని శ్రీరామునిగా ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

### కల్యాణానికి సర్వం సిద్ధం



దొంగరావిపాలెంలో రామాలయం

పెనుగొండ: శ్రీరామనవమి వేడుకలకు ఆచంట, పెనుగొండ మండలాల్లోని రామాలయాలు సిద్ధమయ్యాయి. గ్రామాల్లోని రామాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు, జై శ్రీరామ్ జెండాలతో అలంకరించారు. పెనుగొండలో జవ్వాది వారి రామాలయం, నీరుల్లిపాయల వర్తక సంఘం ఆధ్వర్యంలోనూ, చెరుకువాడలోని రామాలయం, కంబాల వారి వీధిలోని రామాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిద్ధాంతంలోని చౌదరీస్ రామాలయం, దొంగరావిపాలెంలోని రామాలయం, వడలిలోని కాపుల రామాలయాలను కల్యాణానికి సుందరంగా తీర్చిదిద్దారు.

### రేపు సూర్యా కళాశాలలో మెగా జాబ్‌మేళా

నరసాపురం: పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో సోమవారం జిల్లా స్థాయిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దిక్సూచి, పశ్చిమగోదావరిజిల్లా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దివి లేబొరేటరీస్, ముత్తూట్ ఫైనాన్స్ వంటి సంస్థలు పీజీ, డిగ్రీ, ఇంటర్, టెన్త్ చదివిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సర్టిఫికెట్స్, రెజ్యూమ్‌ల జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 95020 24765 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

# యువతకు ఆదర్శనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్

పాలకొల్లు సెంట్రల్: దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన దేశ భక్తుడు, గొప్ప పార్లమెంటేరియన్ నేటి యువతరం నాయకులకు ఆదర్శనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కర్రా జయసరిత, ఖండవల్లి వాసు, ఉచ్చుల స్టాలిన్, యినకొండ రవి, కర్ని జోగయ్య, రామాంజుల మధు, పెచ్చెట్టి కృష్ణాజి, మోకా ప్రేమ్‌చంద్, కుక్కల బాలచందర్, జోగాడ ఉమామహేశ్వరరావు, కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**నరసాపురంలో..**

నరసాపురం: బాబూ జగ్జీవన్‌రావు దేశానికి చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్, దళితనేత ముసూడి రత్నం అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్‌సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ భారత తొలి ఉప ప్రధానిగా జగ్జీవన్‌రావు దేశ సంక్షేమం కోసం పని చేశారన్నారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషిచేశారని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దళితనేతలు కేసీఆర్,



పాలకొల్లు సెంట్రల్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గుడాల గోపి



నరసాపురం: బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పోడూరు: కొమ్ముచిక్కాలలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు

యార్లగడ్డ రవి, మెరిపే దుర్గారావు, ఆకుల శివరామకృష్ణ, బీడీల మెహిర్నియా, కోడెల వెంకటరావు, బాలం దాసు తదితరులు పాల్గొన్నారు.

**పోడూరులో..**

పోడూరు: బాబూ జగ్జీవన్‌రామ్‌ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు అన్నారు. కొమ్ముచిక్కాల గ్రామంలో అరుంధతీ యూత్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టుముక్కల రామకృష్ణంరాజు, ఉపసర్పంచ్ జుత్తుగ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహావిష్కరణలు



పెనుగొండ: మారేమ్మ గూడెంలో జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న నాయకులు

పెనుగొండ: భారత ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్‌ల విగ్రహాల ఆవిష్కరణ పెనుగొండ మారేమ్మ గూడెంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మారేమ్మ గూడెంలో నిర్మించిన విగ్రహాలను జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన రామయ్య, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, మాజీ సర్పంచ్ యాదాల ఆశాజ్యోతి రవిచంద్రలు ఆవిష్కరించారు. అనంతరం రాజుగూడెం, చెరుకువాడ, పంచాయతీల వద్ద డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు.

**ఆచంటలో**

ఆచంటలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీలు నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# శ్రీనివాసరావుకు మూడు సాహిత్య అవార్డులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ రసధుని సాహితీ సంస్థ సహాయ కార్యదర్శి కవి, రచయిత మామిడిశెట్టి శ్రీనివాసరావు ఒకేసారి మూడు సాహిత్య అవార్డులు అందుకున్నారు. శనివారం గుంటూరు జిల్లా పొత్తూరులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొసరాజు ఆర్తి అండ్ జాహ్నవి మెమోరియల్ ట్రస్ట్ మరియు సాహితీ కిరణం ఉభయ తెలుగు రాష్ట్రాల మీద నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో గ్రహణం పట్టిన సూర్యచంద్రులు అనే కవితకు ప్రోత్సాహక బహుమతి, ముట్నూరి కమలమ్మ ఫౌండేషన్ మరియు సాహితీ కిరణం వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిన్న కథల పోటీల్లో జీవన సౌందర్యం కథకి ఉత్తమ కథా పురస్కారం, విడుదల నిహారిక ఫౌండేషన్ మరియు సాహితీ కిరణం వారు నిర్వహించిన జాతీయ స్థాయి సంక్రాంతి కథల పోటీల్లో రుణానుబంధం కథకి ఉత్తమ కథా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కర రావు, గుడాల హరిబాబు, యర్రంశెట్టి వెంకటరత్నం, కారుమూరి శ్రీరాములు, వంగా నరసింహరావు పలువురు సాహితీ వేత్తలు అభినందనలు తెలియజేశారు.



సాహిత్య అవార్డులు అందుకుంటున్న కవి శ్రీనివాసరావు

## రైతులు దళారులను నమ్మొద్దు

భీమవరం అర్బన్: జిల్లాలో 6 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఆర్‌ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్స్ సప్లయ్ మేనేజర్ టి.శివరామ్ ప్రసాద్, డీఎస్‌వో ఎస్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు చింతా శ్రీనివాస్, ఏవో నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేటి నుంచి క్షీరారామలింగేశ్వరుని కల్యాణోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీ పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ సమేత శ్రీ జనార్ధనస్వామివార్ల కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఏడు రోజులు పాటు నిర్వహించనున్నారు. ఆదివారం గణపతి పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణ ప్రతీరోజు రాత్రి 8 గంటలకు నీరాజన మంత్ర పుష్ప తీర్థప్రసాదాల వినియోగం, సోమవారం రాత్రి 5.05 గంటలకు (తెల్లవారితే మంగళవారం) స్వామివార్ల కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం కంచర్ల రామారావు దంపతులతో ప్రసాద వితరణ, గాదె సుబ్బారావు సరోజిని దంపతులచే భక్తులకు గిఫ్ట్ ఆర్టికల్స్ పంపిణీ చేస్తారు. మంగళవారం సాయంత్రం కుంభం వేసి స్వామివార్ల రథోత్సవము నిర్వహిస్తారు. శనివారం ఉదయం స్వామివార్ల త్రిశూల స్నానం రాత్రి 6.45 గంటలకు పుష్పోత్సవము చేస్తారు. కల్యాణోత్సవం గురించి ఇప్పటికే హిందూ సంఘాలు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి స్వామివార్ల కల్యాణం గురించి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా స్వామివారి కళ్యాణాన్ని తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఉత్సవాల అనంతరం ఈ నెల 27న అన్నసమారాధన నిర్వహిస్తామని వివరించారు.



సమావేశంలో పాల్గొన్న హిందూ సంఘాల సభ్యులు



ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి

**ఏర్పాట్లపై చర్చ**

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు సందర్భంగా హిందూ సంస్థలు, భక్తులు, ఆలయ అధికారులు ఏర్పాట్లపై చర్చించారు. స్వామివారి కల్యాణం వీక్షించడానికి భక్తుల సౌకర్యార్థం ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి సందర్భంగా రథోత్సవంలో పాల్గొనే భక్తులు, కళాకారులకు తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. ఊరేగింపు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ కృష్ణవర్మ, జక్కంపూడి కుమార్, మేడికొండ శ్రీనివాసరావు, మురహరి ఈశ్వరరావు, బోణం మునసబు, బాకూరి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేషన్ల రుణాల మంజూరుకు ముగిసిన ఇంటర్వ్యూలు

నరసాపురం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చంద్రన్న ఉపాధి సోపానం పథకంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు శనివారంతో ముగిశాయి. యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంకుల వివిధ శాఖలకు చెందిన మేనేజర్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్‌ఆఫ్ ఇండియాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో పాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు. సచివాలయ ఉద్యోగులు ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు. శనిఆవరం ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం పూట ఒక్కసారిగా అధిక సంఖ్యలో అభ్యర్థులు తరలి రావడంతో మండలపరిషత్ కార్యాలయ ఆవరణ అంతా కిక్కిరిసి పోయింది. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో మొత్తం 1,474 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు చెబుతున్నారు. మండలం మొత్తం మీద 3,780 మంది ఈ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మండలానికి కేవలం 116 యూనిట్లు మాత్రమే మంజూరు కావడంతో దరఖాస్తుదారులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు.



ఇంటర్వ్యూ కోసం క్యూకట్టిన దరఖాస్తుదారులు

## ఉపాధి కూలీల వేతనాలు జమ చేయాలి

కాళ్ల: కోట్లకు అధిపతులైన ఎమ్మెల్యే, ఎంపీల వేతనాలు వారి అకౌంట్లో జమ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెక్కలను నమ్ముకుంటు జీవిస్తున్న ఉపాధి కూలీల వేతనాలు జనవరి నుంచి నేటికీ మూడు నెలలు గడుస్తున్నా జమ చేయకపోవడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కాళ్ల మండల సీఐటీయూ అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని కొలనపల్లి గ్రామంలో శనివారం పర్యటించి చెరువు పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెంటనే వేతనాలు జమ చేసి, ఎండ నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.